

యాజుష స్మార్త గ్రంథం

4

mohan
PUBLICATIONS
Mohanpublications.com
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక
విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.





పురోహిత సార్వభౌమ - అధ్యాపక శిరోమణి - స్మార్త భట్టారక

బ్రహ్మశ్రీ మార్తి వేంకట్రామ శర్మ మహోదయులు

నివేదన

ప్రస్తుత సమాజములో గురుముఖతః సాంప్రదాయికమైన రీతిలో నేర్చుకొని చేయించు యాజ్ఞికులు, అటులనే తగిన గ్రంథములు లభించక పోవుటచే శ్రాద్ధ సంబంధమైన విషయములన్నిటిని ఏర్చి కూర్చినానని శ్రీ గౌరవనీయులైన మిట్టకంటి మధు సూదన రెడ్డిగారితో వారి తల్లిగారైన పద్మమ్మ గారు పరమపదించినప్పుడు గరుడపురాణము చెప్పు తరుణమున ప్రస్తావించగా మాతల్లి దండ్రుల పుణ్యలోక ప్రాప్తికై నేను ఈ గ్రంథమును ముద్రించదలచితిని అని వారు చెప్పగా నేను సంతోషముతో ఈ గ్రంథమును సమగ్రముగా శ్రాద్ధ ధర్మములను ఏర్చి కూర్చి అత్యంత జాగరూకతతో దిద్ది తయారు చేసి ఇచ్చితిని. ఈగ్రంథము అతి త్వరలో వెలుగు చూచుటకు సహకరించిన శ్రీ మిట్టకంటి మధుసూదన రెడ్డిగారి కుటుంబమునకు ఆయురారోగ్య ఐశ్వర్యములను కల్పించు గాకయని శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థిస్తూ వారితల్లి దండ్రులైన కీ॥శే॥ మిట్టకంటి జగ్గారెడ్డి, కీ॥శే శ్రీమతి పద్మమ్మ గార్లకు పుణ్యలోక ప్రాప్తి గలుగుగాక యనియూ భగవంతుని ప్రార్థించుచున్నాను.

అటులనే ఈ గ్రంథమునకు తగిన శోభకూర్చి, అన్నదాన మహిమ, సప్తవ్యాధ చరిత్ర విపులముగా అర్థసహితము వ్రాసి ఇచ్చిన డాక్టర్ బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి సలక్షణ ఘనపాఠీ గార్కి నమోవాకములు అర్పించుచున్నాను. అటులనే మాకు తోడ్పాటునిచ్చి తమ అమూల్యాభిప్రాయములను ఇచ్చి, నిత్యము మమ్ము ఇట్టి సత్కార్యములకు ప్రోత్సాహాన్ని ఇస్తున్న కీసరగుట్ట వేదపాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మశ్రీ కె.యస్.యస్.అవధాని గార్కి, సహోద్యోగులూ అన్నగారైన బ్రహ్మశ్రీ యం.వి.యల్.యన్.శాస్త్రిగార్కీ, శ్రీమాన్ కె.వి.యస్.వి.జి.శేషాచార్యులగార్కి సాష్టాంగ ప్రణామములర్పించుచున్నాను. ఈ గ్రంథమును సుందరముగా తయారు చేసిన సుందర్‌గ్రాఫిక్స్ - చిరంజీవి కల్లూరు సుబ్రహ్మణ్య శర్మకు అభినందనలు తెలుపుచున్నాను.

ఇట్లు

మూర్తి వేంకటరామ శర్మ

విన్నపము

మన సంస్కృతిలో వారసత్వాలలోని నిత్యవ్యవహారిక విలువలకు తోడుగా ఉన్న సార్వజనీన, సర్వకాలిక విలువలు మసకబారుతున్నాయి. పురాతన కాలంలో మానవుడికి స్వల్పమైన ఆత్మజ్ఞానం వుండేది. రానురాను చేస్తున్న వ్యవహారముల వలన కలిగే అనుభవాలద్వారా ఆత్మజ్ఞానం పెంచుకోవడం జరిగింది. ఆ ఆత్మజ్ఞానం వల్లనే తనని తాను సంస్కరించుకోవటం జరిగింది. ఆ సంస్కరణల ఫలితంగానే మానవుడు ఈ రోజు ఈ భౌతిక ప్రపంచాన్ని శాసిస్తున్నాడు. పారిశ్రామికీకరణ, టెక్నాలజి అభివృద్ధి వలన సర్వమానవ ప్రపంచం ఒకటయింది. ఒకరి కొకరు చేరువవటం జరిగింది. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించవలసిన వ్యక్తి, యాంత్రికమైన జీవితానికి బానిసై, మానవతా విలువలు మరిచిపోతున్నాడు. యుగయుగాలుగా నిర్మించుకుంటూ వస్తున్న ఈ నాగరికతా సౌధాలు కూలిపోయే ప్రమాద స్థితి వస్తోంది. ఆటవికత పెరిగి, అరాచకాలు చూస్తూ ఆవేదన, అశాంతికి లోనవుతున్నాడు. సహనశీలత, నిజాయితీ, ప్రేమ, కారుణ్యం, గౌరవ మర్యాదలు రోజురోజుకూ అంతరించి పోతున్నాయి. ఇలా సంస్కృతి మూలాలే కదిలిపోతున్నప్పుడు జాతి భవిష్యత్తు మాటేమిటి? దీనికంతటికీ కారణం కుటుంబ వ్యవస్థ బీటలువారడమేనా? ఇంతటి నిరాశాపూరిత సంక్షోభ సమయంలో వివేకాన్ని, విచక్షణను, మానవతా, కుటుంబ విలువల్ని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈసమస్య పరిష్కార మార్గంపై ఎందరో మేధావులు తమ దృష్టి సారించారు. పతనమైపోతున్న మన సంస్కృతి, విలువల పట్ల నేటి యువతలో జాగరూకత కలిగించి వాటి పట్ల అవగాహన పెంపొందించే అవసరం ఎంతైనా ఉందని చాలామంది అభిప్రాయ పడుతున్నారు. పశుపక్ష్యాదులలో లేని వివేకముండడం మానవునిలోని విశేషం. వివేకమంటే మంచి, చెడులమధ్య నున్న తేడాపాళ్లను గ్రహించగల శక్తి. ఆ వివేకానికి మూలం ధర్మం. అందువలన మానవుడంటే "ధర్మజీవి" అన్న నిర్వచనమున్నది. ధర్మమే మానవుడిని పశుత్వం నుంచి దివ్యత్వం వైపు నడిపించగలదు. మానవుడిని దేవతగా తీర్చి దిద్దడానికి ధర్మం సంస్కారాలను ప్రతిపాదించింది. వివిధ సంస్కారాలలో కూడిన సంస్కృతియే భారతీయ

సంస్కృతి. ఈ సంస్కారాల ప్రభావం వలన మనిషి ప్రకాశిస్తాడు.


నేటి యువతలో కుటుంబ వ్యవస్థ, తల్లితండ్రులు మరియు పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంచి వారికి మన సనాతన ఆచారవ్యవహారములు, గతానుగతికముగాను, మూఢనమ్మకముతోను, యాంత్రికంగాను చేసేవికావని, చేసే ప్రతిపని వెనుక ఒక అర్థము పరమార్థములున్నాయని తెలియజేయడం మూలంగా పతనమవుతున్న విలువల పునరుద్ధరణ కొంతలో కొంతైన జరుగుతుందనే ఆశతో ఉన్న సమయంలో మహాశయులు బ్ర.శ్రీ.మార్తి వేంకట్రామ శర్మ గారితో పరిచయ భాగ్యము కలిగింది. వారు మన ఆచారాల అనుపానులను, అంతర్యాలను, అంతరార్థాలను అందరికి అందించాలన్న మహత్తర సంకల్పంతో ఆయాసంస్కారములకు సంబంధించిన గ్రంధాలను వెలువరించుటకు పూనుకున్న మహాశయులు. ప్రస్తుతము శ్రాద్ధ సంబంధమైన విషయములన్నిటిని ఏర్చికూర్చి గ్రంధము వ్రాయుచున్నానని తెలియజేయడంతో, అదే ఆశయంతో ఉన్న నేను వెంటనే ఈ గ్రంధ ముద్రణ భారాన్ని స్వీకరించాను. మాఈ ప్రయత్నము ఇంతటితో ఆగకుండా ఇంకా ముందు ముందు ఎన్నో సనాతన ధర్మాచారాలను తెలియజేసే గ్రంధాలను వెలువరించి... ప్రశాంత జీవనానికి దూరమౌతున్న మనిషి ఇంద్రియ, మనోనిగ్రహాల ద్వారా, అహంభావాన్ని వదిలి విజ్ఞతను పెంచుకోవాలని ఆత్మజ్ఞానానికై తన తెలివితేటలను జోడించి సామాజిక వికాసానికి తోడ్పడాలనే సంకల్పం కొంతలో కొంతైన నెరవేరగలదని చిరు ఆశతో ముందుకు సాగుతున్నాము. మా ఈ ప్రయత్నాన్ని అందరూ సాదరంగా స్వాగతిస్తారని ఆశిస్తూ.....

విధేయుడు

మిట్టకంటి మధుసూదనరెడ్డి

[illegible]

రక్తం స్రవ్యంచ మాతృకం ... భూమాతా విష్ణుమూర్తి



ఆదౌ పితా తథా మాతా సాపత్నీ జననీ తథా
మాతామహీ పితామహ్యౌ ఆత్మ పత్నీ స్వసాంతరం
సుతా (భార్యా) పితృ వ్యాపత్నీ మాతులానీ భార్యకాః
దుహితా భగినీ చైవ దౌహిత్రో భాగినేయకః
పితృష్వసా మాతృష్వసా ఇమూలా భ్రాతృపుత్రస్య
శ్వశుర స్నాలక శ్యాలః స్వామినో గురుస్తథా

గ్రంథకర్త పరిచయము

1. పేరు	మార్తివేంకట్రామశర్మ
2. తల్లిదండ్రులు	మార్తి కోదండపాణి శాస్త్రి, రామలక్ష్మమ్మ
3. జననము	12-06-1961
4. విద్యాభ్యాసము	కృష్ణయజుర్వేద స్మార్తము, పూర్వాపరములు ఆపస్తంబ గృహ్యసూత్ర భాష్యము ఏకాగ్నికాండ మంత్రభాష్యము సాహిత్యము - సంస్కృత కావ్యములు.
5. వృత్తి	స్మార్తపండిట్, స్మార్తశాఖ అధ్యక్షులు శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాల కీసరగుట్ట-రంగారెడ్డి జిల్లా.
6. అనుభవము	స్మార్త కార్యములు చేయించుట రుద్రయాగాది యాగముల చేయించుట ధర్మశాస్త్ర పరిశీలన, 14సం॥లుగా ఉపాధ్యాయ వృత్తిలో అనేకమంది విద్యార్థులను పండితులుగా చేయుట.
7. రచనలు	ముద్రితములు:- యాజుషస్మార్త గ్రంథః పార్టు-1, పార్టు-2. సప్రయోగ ఆబ్దికమంత్రం - సప్రయోగ మహాలయ, మాసిశ్రాద్ధ ప్రకరణమ్. అముద్రితములు:- పంచదశ సంస్కారములు - సప్రయోగం.
8. హోదా	అధ్యక్షులు శ్రీ గాయత్రీబ్రాహ్మణ సాంస్కృతిక సేవాసంస్థ - దమ్మాయిగూడా
9. బిరుదులు	జ్యోతిష పరిషత్, సనాతన ధర్మ సంస్థలచే "పురోహిత సార్వభౌమ" "అధ్యాపక శిరోమణి"
10. అభిరుచి	స్మార్త గ్రంథముల సంకలనము. కర్మకాండల ఆవశ్యకత, మహిమల వివరణం, స్మార్త విద్యావ్యాప్తికి ధర్మవ్యాప్తికై కృషి చేయుట.

మున్నుడి

శ్లో॥ కాండ ద్వయోప పాద్యాయ కర్మబ్రహ్మ స్వరూపిణే ।
స్వర్గాప వర్గ రూపాయ యజ్ఞేశాయ నమోనమః ॥

భక్త మహాశయులారా! మనది కర్మభూమి. ఈ కర్మ భూమిలో అనేక మంది సత్కర్మాచరణచే భగవదను గ్రహమును పొందిరి. అట్టి కర్మలు మూడు విధములుగా ఉన్నవి. 1.నిత్య, 2.నైమిత్తిక, 3.కామ్య కర్మలు. ఇందు నిత్య కర్మలనగా సంధ్యావందన, అగ్నిహోత్ర, వైశ్వదేవ, బ్రహ్మయజ్ఞ, అతిథి పూజాదులు. నైమిత్తికములు అనగా ఒక నిమిత్తమును గూర్చి చేయునవి. దర్శశ్రాద్ధాదులు, ప్రత్యాబ్దికములు, సంక్రాంతులు, వ్రతాదులు మున్నగునవి. ఇక కామ్య కర్మలనగా అనిష్ట పరిహారముగా ఇష్ట ప్రాప్తికై ఆచరించెడి శాంతి, పౌష్టిక కర్మలు.

ఈ కర్మలలో పితృదేవతల నారాధించెడి కర్మలను శ్రాద్ధములు అందురు. "శ్రద్ధయా అనేనేతి శ్రాద్ధమ్" – అనగా అత్యంత శ్రద్ధాభక్తులచే చేయ తగిన కర్మ అని అర్థము. దేవతా పూజలకంటే ఎక్కువ శ్రద్ధగాశుచిగా, మడిగా ఆచరించ దగినవి పితృకర్మలు. కారణమేమనగా దేవతా పూజలు భక్తులందరూ చేయుదురు – కానీ, మన పితరుల నుద్దేశించి చేయదగు కర్మలు మనమే చేయవలెను – ఇతరులు చేయరు.

కావున శ్రద్ధ అనెడిది శ్రాద్ధములందు అత్యావశ్యకము అయి ఉన్నది. ఈ శ్రాద్ధ కర్మలు బహువిధములుగా ఉన్నవి. ఉదా:– నిత్యశ్రాద్ధము, షణ్ణవతి శ్రాద్ధములు, ప్రత్యాబ్దిక శ్రాద్ధములు, కామ్య శ్రాద్ధములు – నాందీ శ్రాద్ధములు – గ్రహణ శ్రాద్ధము నిత్యశ్రాద్ధమనగా నిత్యము ఒక బ్రాహ్మణునికి పితృదేవతారూపమున అర్చించి భోజనము పెట్టి తర్పణ చేయుట దీనిలో తిలలు, ప్రాచీనావీతము అపేక్షితములు గావు. బ్రహ్మచర్య అధశ్శయ్యాది నియమరహితమైనది.

శ్లో॥ అమామను యుగ క్రాంతి ధృతి పాత మహాలయాః ।
త్రిస్రోష్టకాశ్చ విజ్ఞేయా షణ్ణవత్యః ప్రకీర్తితాః ॥

అమావాస్యలు 12, మన్వాదులు 14, యుగాదులు 4, సంక్రాంతులు 12, వైధృతులు 13, వ్యతీపాత్‌లు 13, మహాలయములు 16,అష్టకాన్వష్టకములు = 96 ఇవిషణ్ణవతి శ్రాద్ధములనబడును.

ప్రత్యాబ్దికమనగా అబ్దే అబ్దే ప్రత్యబ్దమ్, అనగా మృతాహస్సునందు జరుపబడు శ్రాద్ధము. కామ్య శ్రాద్ధములు గూడా కొన్ని, ధర్మ శాస్త్రములందు కన్పట్టుచున్నవి. లోకవ్యవహారమున ఆచరించు వారు కనుపడుటలేదు. కోర్కెతో చేయు శ్రాద్ధము అని అర్థము నాందీ శ్రాద్ధములనగా శుభకార్యములయందును సమస్త గృహ్యాకర్మలయందునూ ఆచరించతగినవి.

శ్లో॥ అనస్మద్వృద్ధ శబ్దానాం, అరూపాణాం, అగోత్రిణాం ।
అనామ్నా మతి లాద్యైశ్చ నాందీ శ్రాద్ధం విధీయతే ॥

అనగా అస్మత్, వృద్ధ ప్రపితామహ అనెడి వృద్ధ శబ్దములు, వస్వాది రూపములు, గోత్ర వివరణము, నామోచ్చారణ, తిలలు, ఇట్టివి లేకుండా హరిద్రాక్షతలతో, ప్రాచీనావీతము లేకుండా 1.విశ్వేదేవతలను, 2.మాతృ, 3.పితృ దేవతలనూ, 4.మాతా మహులను అర్చించవలెను ఇది నాందీ శ్రాద్ధవిధి ఆంధ్ర దేశమున ఇది హిరణ్యదాన రూపముగా ఆచరించుచున్నారు. ద్రవిడ దేశమున ఇప్పటికీ శుభకార్యములకు ముందుగా ఇది యథావిధిగా కొందరు ఆచరించుట గోచరించుచున్నది. ఇక సూర్య చంద్ర గ్రహణముల యందు చేయవలసిన శ్రాద్ధము గ్రహణ శ్రాద్ధమనబడును.

శ్లో॥ గ్రస్యమానే భవేత్స్నానం, గ్రస్తేహోమోర్క చంద్రయోః ।
ముచ్యమానే భవేద్దానం (శ్చాద్ధం) ముక్తౌస్నానం విధీయతే ॥

గ్రహణ కాలమున ముందు స్నానము - జపము, హోమము, శ్రాద్ధము, దానము, స్నానము క్రమముగా ఆచరింపవలెను.

జ్ఞాత్వా కర్మాణి కుర్వీత యని పెద్దలమాట కావున పై విషయములను తెలుసుకొని శ్రద్ధగా ఆచరించుటచే పితరులకు ముక్తి కలిగించుటయేగాక మనము కృత కృత్యులమై పుత్రత్వ సిద్ధిని బొంది పితృదేవతానుగ్రహముచే సకల శ్రేయస్సులను పొందగలము.

శ్రాద్ధ విహితములు - త్యాగములు - ధర్మములు

శుచిత్వము గలిగిన, మంత్రవేత్తలైన యోగ్యులైన బ్రాహ్మణులను ఆబ్దికాదులయందు భోక్తలుగా నిమంత్రించవలెను. మేనల్లుళ్ళు, భావమరదులు ఇటివంటి యోని సంబంధీకులుగానీ మంత్ర సంబంధీకులుగానీ, (శిష్యులు) భోక్తలకు పనికిరారు. మరియూ సగోత్రీకులనుగూడా భోక్తగా నియమించ రాదు - అభావ పక్షములో విశ్వేదేవస్థానమందు నియమింప వచ్చును. నిత్య శ్రాద్ధమందునూ, గయా శ్రాద్ధమందునూ, సోదకుంభ శ్రాద్ధములందునూ, సగోత్రుని నియమించ వచ్చునని బృహస్పతి వాక్యము. భార్య రజస్వల అయిన కాలములోనూ, ఆరవ మాసమునిండిన గర్భవతి భర్తయూ, శ్రాద్ధ భోక్తలుగా ఉండుటకు అర్హులుగారు. సాధారణముగా బ్రాహ్మణ శోధన చేయకూడదు. విశేష ధర్మమేమనగా పితృకర్మలందు బ్రాహ్మణులను పరిశీలించి యోగ్యులనే నియమించుకొన వలెను. తీర్థ క్షేత్రముల యందు చేయు శ్రాద్ధములందు తీర్థవాసులను నియమించవలెను - వారిని శోధించ నక్కర లేదని స్కాంద పురాణ వచనము. భోక్తలను నిమన్త్రించు నప్పుడు బ్రాహ్మణుని కుడిపాదమును స్పృశించి నిమంత్రించవలెను. క్షత్రియులు ఎడమపాదమును స్పృశించియూ, వైశ్యులు రెండు పాదములు పట్టుకొనియూ, శూద్రులు ప్రార్థనా పూర్వకముగాను బ్రాహ్మణులను నిమంత్రించు కోవలెను. విశ్వేదేవులు లేకుండా శ్రాద్ధము జరిపినచో, పిశాచ, రాక్షస, యక్ష, భూతములూ శ్రాద్ధమును నష్టపరుచుదురు. కావుననే విశ్వేదేవతలను పూజించుట శ్రాద్ధములందు విధించబడినది.

కర్తృ నియమములు

శ్రాద్ధకర్త తద్దినము రోజుననూ, పూర్వాపర దినములందునూ పరాన్నమును

స్వీకరింపరాదు. స్వీకరించినచో పితృ ఘాతకుడగును. శ్రాద్ధదినమున కర్త, దంత ధావనము, (కాష్ఠాదులతో) తాంబూల చర్వణము, క్షౌరము, అభ్యంగనము, స్త్రీ సాంగత్యము, ఔషధ సేవనము, అల్పాహారము చేయుట పరాన్నము, అని ఈ ఎనిమిది పనులు చేయరాదు. శ్రాద్ధ దినమున ఘంటానాదము చేయుట, రుద్రాక్షధారణ పనికిరాదు - మరియు కర్తగానీ, భోక్తగానీ, ఒక్క వస్త్రముతో నుండరాదు. విధిగా ఉత్తరీయమును ధరించవలెను. మరియూ శ్రాద్ధమునకు ముందుగా, దానములు చేయుట, అధ్యయనమును చేయుట విశేష దేవతారాధనలు, జపములు, హోమములు, వ్రతానుష్ఠానములు, భిక్షువులకు ఆహారమిచ్చుట మొదలగునవి పనికిరావు. మరియూ, మరణవార్త విన్ననూ, పుత్రజనన మైనప్పుడు సంక్రమణముల యందునూ, శాద్ధ దినములందునూ, పర్వదినములందునూ (గ్రహణాదులు) చండాల, ఆశౌచముగల వారిని స్పృశించిననూ, వేడినీటి స్నానము చేయరాదు - చన్నీటి స్నానము చేయవలెను - తెలిసియూ, అనారోగ్యాది నిమిత్తములు లేకుండానూ వేడి నీటిస్నానము చేసినచో గోహత్యా పాతకములు కల్గునని స్మృతి వచనము. గోధుమ, పెసర, మినుము, నూనె, నెయ్యి మొదలైన పదార్థములు లేకుండా ఆబ్దికము పెట్టి ననూ నిరర్థకమేయగును. కావున ఆవస్తువులను ఆబ్దికము నందు విశేషముగా ఉపయోగించవలెను. తలిదండ్రులకు జీవించి ఉండగా ఇష్టమైన యోగ్యపదార్థములను శ్రాద్ధముల యందు ప్రయత్న పూర్వకముగా ఉపయోగించవలెను.

భోక్తృ ధర్మములు

శ్రాద్ధము నందు నిమంత్రితుడైన భోక్త, కర్తయూ, స్త్రీసంగము చేయరాదు. ఆనియమమును ఉల్లంఘించినచో పితృదేవతలు ఆరు మాసములు రేత భోజనము చేయవలసి వచ్చును - ఒక శ్రాద్ధమునందు నిమంత్రితుడైన భోక్త ఆశ్రాద్ధమునకు గాక, వేరొక చోటకి భోజనమునకు వెళ్ళినచో అట్టి భోక్త నూరు నరకములననుభవించి, చండాల జన్మనొందగలడు. శ్రాద్ధభోక్త, మరల భోజనము చేయుట అరణ్య సంచారము, బరువులెత్తుట, వేదాధ్యయనము చేయుట, రతిక్రియ సల్పుట, సంధ్యావందనములో దశాధికముగా గాయత్రీ

జపము, వేరొక చోట ప్రతిగ్రహణము, హోమములు చేయుట (ఔపాసన) పనికి రాదు –

ప్రత్యాబ్దిక భోక్త ఒక రోజులో పవిత్రుడగును.

మాసికములయందు ఆరు రోజులలో పవిత్రుడగును.

ఊనషాణ్మాసిక, సంపిండీకరణ, ఏకోద్దిష్ట శ్రాద్ధ భోక్త 1 సంవత్సరమునకు శుద్ధుడగును.

శ్రాద్ధ పాకమున వంకాయ, సొరకాయ, గోంగూర, మునగతోపాటు టమోటా, క్యాబేజీ, కేలీ ఫ్లవర్, బీట్‌రూట్, కేరట్, ఆలుగడ్డ వంటి ఆధునిక కూరగాయలూ వర్జనీయములే.

ప్రత్యాబ్దికమున భూరి భోజనము పెట్టవలనని శాస్త్రవచనము, అనగా శ్రాద్ధ పాకముగాక వేరేవంట చేయించి శ్రాద్ధము అయిన పిమ్మట భోజనము పెట్టించవలెను – శ్రాద్ధ పాకము (పితృశేషము) జ్ఞాతులు, బంధువులకే పరిమితము. స్నేహితుని ఇంటనూ, గురువుగారి ఇంటనూ, మేనమామ ఇంటి యందును, సోదరీ, మామగారి ఇంటభోజనము చేసిననూ పరాన్నము గాదని పెద్దల వచనము.

శ్రాద్ధ ధర్మములు

ఈ కలి యుగమున శాస్త్రీయముగు కర్మలను ఆచరించుట బహుదుర్లభముగా ఉన్నది. ప్రత్యాబ్దికము పెట్టుటకు (వంట చేసిపెట్టుటకు) వసతి కుదరకపోతే అమశ్రాద్ధము అనగా బియ్యం, పచ్చికూరలు, పప్పుదినుసులు మొదలగు వస్తువులను ఇచ్చి శ్రాద్ధము జరుపుట యుక్తము – వస్తువులు లభించని సందర్భములోనే హిరణ్య శ్రాద్ధము (బంగారము గానీ, డబ్బుతోగానీ శ్రాద్ధము జరుపుట) చేయవలెను. సదుపాయములన్నీ ఉండి చేయుటకు అశక్తుడగుచో సంకల్పవిధిగా భోజనము పెట్టి చేయునది సంకల్ప శ్రాద్ధమనబడును – ఏ వసతీ కుదరని పక్షములోనే తిల తర్పణగావించి పితృదేవతలను తృప్తులను చేయవలెను. ఆ తిలలు సంపాదించుటకు గూడా అశక్తుడై (దరిద్రుడైనచో) ఊరి వెలుపలకు వెళ్ళి

చేతులు పైకి చాచి ఓ పితృదేవతలారా! నేను దారిద్ర్యపీడితుడనై ఆహారము లేక శుష్కించు చున్నాను నాకన్నీటిని మీరు స్వీకరించి తృప్తులగుదురుగాకయని రోదించ వలెను - పైవేవీ ఆచరించక శ్రాద్ధ త్యాగము చేసినవాడు జీవనీయుడు గాదని స్కాందపురాణము చెప్పుచున్నది.

శ్లో ॥ ధనవంత మదాతారం, దరిద్రమత పస్వినమ్ ।

ద్వావంభసి నివేష్ట వ్యౌ, కంఠే బధ్వా దృఢాంశిలాం ॥

ధనవంతుడై ధర్మ కర్మాచరణ చేయకున్ననూ, దరిద్రుడై తపో, జప, భగవన్నామ స్మరణ రహితుడైననూ, కర్మ, ధర్మ భ్రష్టులను మెడలో బండరాయి గట్టి నీటిలో పడవేయ వలెనని భావము.

సర్వజనాస్సుఖినో భవంతు. సర్వేషాంసమస్త సన్మాంగళాని సంతు

ఇట్లు

సుధీవిధేయుడు

మూర్తి వేంకటరామ శర్మ

23-9-2004

☆☆☆

విషయ సూచిక

శ్రీరామలింగాష్టకము

శ్లో ॥ శుద్ధజ్ఞాన ప్రదో నిత్య ఐహికాముష్మికార్థదః ।
భవానీ సహితో దేవో రామలింగోఽభిరక్షతు ॥

శ్లో ॥ రామలింగ ప్రభుం వందే జగత్కారణ కారణమ్ ।
త్రిపురాసుర హంతారం భక్త కల్పమహీరుహమ్ ॥

శ్లో ॥ హే! రామలింగ! హేనాథ! తాపత్రయ నివారక ।
కామక్రోధాది సంతప్తం రక్షమాం భవసాగరాత్ ॥

శ్లో ॥ ప్రతిష్ఠితోహి యోదేవస్సీతా రామేణ ధీమతా ।
కేసరాద్రౌ విజయతే భవానీ సహిత శ్శివః ॥

శ్లో ॥ మృత్యుంజయాయ రుద్రాయ నీలకంఠాయ శంభవే ।
శుద్ధస్ఫటిక వర్ణాయ రామలింగాయతే నమః ॥

శ్లో ॥ ప్రతిష్ఠితోసి రామేణ పూజితోసి సురైరపి ।
తథైవ ద్విజవర్యైశ్చ అర్చితోసి సదాప్రభో ॥

శ్లో ॥ హృత్పుండరీక మధ్యస్థో భూతానాంచ హితే రతః ।
నిత్యముక్తో జగత్సా క్షీ పాలయత్వనిశం మృడః ॥

శ్లో ॥ భస్మాను లిప్త సర్వాంగ కరుణాకర శంకర ।
స్వీకురుష్వ స్తుతిమిమాం భక్త్యా ప్రథమతోర్పితామ్ ॥

ఫలశ్రుతిః

రామలింగాష్టక స్తోత్రం యః పఠేద్భక్తి మాన్నరః ।
స సర్వపాప నిర్ముక్తో దుర్లభాం గతి మాప్నుయాత్ ॥

ఇతి మార్తి వేంకట్రామశర్మణా విరచిత శ్రీరామలింగాష్టకం సంపూర్ణం

డా॥ విష్ణుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి (M.A. Ph.D)
ప్రాచార్యః
వేదభాష్యవిజ్ఞాన పరిశోధనాకేంద్రం
వేదభవనం - సికింద్రాబాద్.

శ్రాద్ధమహిమ

లోకములో మానవులపాప నివృత్తి కొరకు శాస్త్రములు అనేక విధకర్మలను బోధించినవి. అట్టికర్మలలో నైమిత్తిక కర్మలు నిత్యకర్మలవలే పాపక్షయకారణములని శాస్త్ర మర్యాద. ఒక నిమిత్తమును ఆధారముగ చేసుకుని చేయవలసిన కర్మలు కనుక ఆ కర్మలను నైమిత్తిక కర్మలందురు అట్టి కర్మలలో శ్రాద్ధకర్మలు ప్రాముఖ్యమును చెందియున్నవి. లోకములో శ్రాద్ధ కర్మల పట్ల రానురాను శ్రద్ధ సన్నగిల్లి ఆచరణలుప్తమగుచున్నట్లు కనపడుచున్నది. ఇట్టి స్థితిలో శ్రాద్ధమహిమను సోపాఖ్యానముగ వివరించినచో లోకములో ఆస్తికత్వమునకు పునరుజ్జీవనము లభించుననియు, లోకము శ్రాద్ధకర్మలను శ్రద్ధతో ఆచరించి పితృదేవతానుగ్రహమునకు పాత్రులై సమస్త శ్రేయస్సులను పొందగలరని శ్రాద్ధమహిమ ఇచట వివరించబడుచున్నది.

"శ్రద్ధయాదీయత ఇతి" శ్రాద్ధం అను వ్యుత్పత్తి ప్రకారము శ్రాద్ధకర్మ శ్రద్ధాతిశయముచే చేయతగినదైయున్నది. శ్రాద్ధములు అనేకవిధములుగా ఉన్ననూ వానిలో ప్రత్యాబ్దికము అవశ్యాచరణీయము ప్రత్యాబ్దికమనగా ప్రతి సంవత్సరము చేయతగినది అంతేకాదు ప్రతినిత్యము శ్రాద్ధాచరణ మున్నట్లు మనుస్మృతిలో మనుమహర్షి ఈ శ్లోకములో ఇట్లు ప్రబోధించిరి।

శ్లో॥ కుర్యాదహరహశ్శ్రాద్ధం అన్నాద్యేనోదకేనవా ।
పయోమూల ఫలైర్వాపి పితృభ్యఃప్రీతిమావహన్ ॥ -మ॥ స్మృ. 3-82

గృహస్థు ప్రతిదినము పితృదేవతల ప్రీతికొరకు అన్నము ఉదకము, పాలు, దుంపలు, ఫలములు, తిలలు, వ్రీహులు మున్నగు పదార్థములచేత శ్రాద్ధమాచరించవలయును.

శ్రాద్ధాచరణవిషయములో విశ్వేదేవతలు సాక్షిగా ఉందురు. శ్రీమహావిష్ణువు శ్రాద్ధమునకు పర్యవేక్షకులుగా ఉండును. ప్రధానదేవతలు పితృదేవతలు వీరు ముగ్గురు. తండ్రి, తాత, ముత్తాత, తండ్రి వసుస్వరూపుడు, తాత రుద్రస్వరూపుడు, ముత్తాత ఆదిత్యస్వరూపుడు. ఈ ముగ్గురు వసు, రుద్ర, ఆదిత్యలోకములయందు ఉందురని, శాస్త్రసంప్రదాయము. ఒకానొకప్పుడు ఈ ముగ్గురు వారి కర్మఫలాను భవానంతరము ఆలోకములను విడిచి కర్మానుగుణముగ మరోలోకములో ప్రవేశించి ఉండవచ్చును, కాని వారు ప్రవేశించిన లోకములు వారి స్థితి వసురుద్రాదిత్య లోకముల యందే తెలియబడును.

శ్రాద్ధాచరణ విషయములో ఒకానొకస్థితిలో భోక్తలగు బ్రాహ్మణులు లభించనిచో శ్రాద్ధకర్త అరణ్యమునకు వెళ్లి పెద్దగా పితృదేవతలను పిలిచినాకు బ్రాహ్మణులు లభించలేదు శ్రాద్ధము ఆచరించలేక పోవుచున్నాను అని పెద్దగా ఏడవవలెను. మరియు శ్రాద్ధాచరణ విషయములో ఇట్లుండవలెను. భోక్తలు తమ భోజనకాలములో కర్తలు తమకొరకు వండిన భక్ష్యాది పదార్థములలో అపేక్షిత పదార్థములను అడిగి స్వీకరించి భుజించవలెను. ఆయా భక్ష్యపదార్థములు భుజించవలెనని ఉన్ననూ సిగ్గుతో అడగలేక భక్షించలేకపోయినచో ఆదోషము భోక్తలదే। అయిననూ కర్త మాటిమాటికి భక్ష్యపదార్థములను అడిగివేయనిచో ఆదోషము కర్తదేయగును.

శ్రాద్ధాచరణ విషయములో కొన్ని రహస్యములు తెలుసుకోతగినవి ఉన్నవి। శ్రాద్ధము అనుష్ఠింపబడుచుండగ విశ్వేదేవతలు వసురుద్రఆదిత్య లోకములకు వెళ్లి అచట ఉన్న పితృదేవతలతో ఇట్లు చెప్పెదరు । ఓ పితృదేవతలారా? భూలోకములో మీ పుత్రపౌత్రాదులు మీ కొరకు శ్రాద్ధము ఆచరించుచున్నారు, అని చెప్పెదరు. ఆ సమయములో పితృదేవతలు ఆ లోకములోనే ఉన్నచో భూలోకములో పితృదేవతా స్వరూపముతో భుజించుచున్న బ్రాహ్మణుల భోజనతృప్తిని అనుసరించి పితృదేవతలు తృప్తి చెందగలరు. ఒకవేళ పితృదేవతలు ఆలోకములో లేక లోకాన్తరములో ఉన్నచో వారెచట ఉన్నది వసురుద్రాదిత్య లోకములో విచారించి విశ్వేదేవతలు వారేలోకములో ఉండిరో ఆలోకములో వారికి శ్రాద్ధకర్త సమర్పించిన పిండము మున్నగు ఆహారములను సంక్రమింపచేసెదరు, ఇచట ఒకరహస్యము తెలియతగినది. ప్రస్తుతము పితృదేవతలు ఏలోకములో ఉండిరో ఆలోకవాసులు ఏ ఆహారముతిందురో ఆవిధమయిన ఆహారముగ కర్త ఇచ్చిన పిండాది

అన్నము మున్నగు పదార్థములను మార్చి పితృదేవతలకు చెందునట్లు చేసెదరు। అదెట్లనగ పితృదేవతలు పుణ్యవశమున దేవతాలోకములో ఉన్నచో అప్పుడు భూలోకములోకర్త ఇచ్చిన పిండాది అన్న విశేషములను విశ్వేదేవతలు దేవతలకు ఆహారమయిన అమృతస్వరూపముగా మార్చి అందించగలరు. ఒకవేళ పితృదేవతలు పాపవశమున రాక్షసలోకములో ఉన్నచో అప్పుడు కర్త ఇచ్చిన పిండాది అన్న విశేషములను రాక్షసులకు ఆహారమయిన మాంసమునెత్తురుగా మార్చి భుజింపచేయగలరు। ఒకవేళ పితృదేవతలు భూలోకములో పశుస్వరూపముగ ఉన్నచో అప్పుడు కర్త ఇచ్చిన పిండాది అన్న విశేషములను విశ్వేదేవతలు లేత పచ్చగడ్డి మున్నగు పశువులకు యోగ్యమగు ఆహారముగ మార్చి సమర్పించగలరు.

శ్రాద్ధ విషయములో ఒక ఉపాఖ్యానము భరద్వాజ మహర్షికి ఏడుగురు పుత్రులున్నారు, వారు గురుకులమందు విద్యనభ్యసించుచుండెడివారు। ఒకానొక రోజున గురువుగారి గోవును మేపుటకై అరణ్యమునకు తీసుకెళ్లిరి. అచట శిష్యులకు ఆకలి కలిగినది. ఆకలి బాధకు ఓర్వలేక ఆగోవును భక్షించుటకు సిద్ధపడిరి। కాని గోవును భక్షించుట యుక్తమా అయుక్తమా? అని సందేహము కలిగినది। కృతాది యుగములలో ధర్మతారతమ్యమును అనుసరించి శ్రాద్ధకాలములో గోమాంసము పితృదేవతలకు సమర్పించుటను ధర్మశాస్త్ర కర్తలు అంగీకరించిరి। కాని స్వేచ్ఛగా స్వోదరపూరణకొరకు మాంసభక్షణము నిషిద్ధమైయున్నది కలియుగములో శ్రాద్ధాదులయందుకూడ మాంసవినియోగము నిషిద్ధమే. కలియుగములో స్వోదరపూరణకొరకు నిషిద్ధమని వేరెచెప్పనేల? ఆ ఏడుగురిలో జ్యేష్ఠుడు మొదలగు 4గురు ప్రథమసోదరులు ఉదరపూరణకొరకు గోవును భక్షించవచ్చని నిర్ణయించిరి। కాని మిగిలిన చివరి సోదరులు ముగ్గురు గోవును స్వోదరపూరణకొరకు భక్షించుట తగదని చెప్పిరి. జ్యేష్ఠాది నలుగురు సోదరులు వారి నిర్ణయప్రకారము గోవును భక్షించుటకే ప్రయత్నించిరి। ఇంతలో ఏడవ సోదరుడు మాంసము స్వోదర పూరణకొరకు భక్షించుట తగదు ఒకవేళ భక్షించవలసినచో గోమాంసములో కొంతభాగమును మూడుపిండములుగా చేసి శ్రాద్ధములో పితృదేవతలకిచ్చి మిగిలిన మాంసమును తినవలెనని ప్రబోధించెను. ఇట్లు భరద్వాజపుత్రులలో అభిప్రాయభేదములున్నను క్షుద్బాధను భరించలేక గోమాంసమును పితృదేవతలకు సమర్పించి భక్షించిరి। సాయంకాలము గురువుగారి ఇంటికి దూడను ఒక దానినే

తీసుకువెళ్లిరి । అంతగురువు గోవు ఏది? అని అడుగగా అరణ్యములో క్రూరమృగములచే భక్షింపబడినది అని అబద్ధము చెప్పిరి । గురు గోద్రవ్య భక్షణ పాపము, గోహత్యాపాతకము, గురువునకు అబద్ధముచెప్పిన పాపము ఈ మూడుదోషములచేత ఈ భరద్వాజపుత్రులు ఏడుగురు సోదరులు ఒకేసారి మరణించి దశార్ణదేశములో ఒక వ్యాధునకు పుత్రులై జన్మించిరి. వీరు గోమాంసమును భక్షించినప్పటికి గోమాంసమును పితృదేవతలకు సమర్పించి భక్షించుటచేత ఆ పుణ్యమువలన వీరికి పూర్వజన్మస్మృతి లభించినది । అంతేకాదు రాబోవు మూడు జన్మలవరకు పూర్వజన్మ స్మరణ లభించగలదు అందుచేతనే వారు ఈ జన్మలో వ్యాధులయిననూ పూర్వజన్మలో బ్రాహ్మణులై ఉండుట చేత బ్రాహ్మణధర్మములనే అనుసరించుచుండెడివారు మరియు వ్యాధ ధర్మములయిన హింసాదులను పరిత్యజించి అహింసా పూర్వకముగ తల్లిదండ్రులను ఎల్లప్పుడు సేవించుచుండెడి వారు. ఆ జన్మలో కాలధర్మము చేసినతరువాత 7గురు సోదరులు కాలాంజన పర్వతమందు లేడిజన్మపొందిరి. లేడి జన్మలో కూడ పూర్వజన్మస్మృతి ఉన్నది. పూర్వజన్మలో స్వోదరపూరణకొరకు గోమాంసభక్షణ చేసిన పాపమును స్మరించుచు చింతాక్రాన్తులై భగవధ్యానముతో కాలము గడిపిరి తరువాత జన్మమూడవ జన్మ. ఆ జన్మలో శరద్వీపములో చక్రవాకపక్షులై జన్మించిరి. ఈ జన్మలోకూడ పూర్వజన్మలలోవలె పూర్వజన్మస్మరణ పాపస్మరణ భగవత్స్మరణలు ఉన్నవి । నాలుగవ జన్మలో 7గురు సోదరులు మానససరోవరమందు హంసలై జన్మించిరి. ఈ జన్మలోకూడా పూర్వ జన్మస్మృతి, పాపచింత, భగవచ్చింతనము పూర్వజన్మలోవలె ఉన్నవి. ఒకానొకరోజున బాభ్రవ్యమహారాజు రాణితో మంత్రులతో కలసి క్రీడార్థమై హంస సోదరులున్న సరస్సువద్దకు వచ్చిరి. అచట రాణీరాజులు క్రీడించుచుండగ హంససోదరులు వారిని చూచిరి అందులో సప్తమ (7) హంస సోదరుడు క్రీడించుచున్న రాజదంపతులను చూచి ఓ సోదరహంసలారా? రాజభోగము ఎంత గొప్పది. నాకు మరో జన్మ ఉన్నచో ఆ జన్మరాజజన్మ అయినచో బాగుండును అని చెప్పెను । అతని కోరికను విన్న హంస సోదరులు ఆరుగురు అట్లే రాజజన్మపొందమని 7వ హంస సోదరుని శపించిరి । అంత 7 వ హంస సోదరుడు ఓ సోదరులారా? మీరు లేకుండగ నేనొక్కడిని రాజభోగములను అనుభవించుట తగినపనికాదని తెలిసికూడ సర్వసాధారణముగ అట్లుపలికితిని అని చెప్పి గట్టిగా ఏడ్చెను.

అంతలో జ్యేష్ఠుడు మొదలగు 4గురు హంససోదరులు తమతరువాత సోదరులతో ఇట్లనిరి । రాజుగా జన్మించబోవు సప్తమసోదరునకు మీరిద్దరు మంత్రిగా పురోహితులుగా జన్మించండి । అప్పుడు సప్తమసోదరునకు సోదరులతో వియోగ దుఃఖముండదు మీ ముగ్గురు రాజ మంత్రిపురోహితులుగా జన్మించుగాక అని ముగ్గురిని శపించిరి. రాజభోగములపై అభిలాష కలుగుట వలన సోదరుల శాపమువలన ముగ్గురు హంస సోదరులకు పూర్వ జన్మ స్మృతి నశించినది. ఈ ముగ్గురు హంససోదరులు భరద్వాజపుత్రులుగా ఉన్నప్పుడు గోమాంసభక్షణ కూడదని నిషేధించినవారు సప్తమ సోదరుడు మాత్రము అట్టి అకృత్యమునకు పాల్పడతలచినచో గోమాంసమును మూడుపిండములుగా చేసి పితృదేవతలకిచ్చి మిగిలిన మాంసమును తినవలెను అని చెప్పిగొప్ప పుణ్యమును సంపాదించినవాడే కాని ఆపుణ్యము హంసజన్మలో ఉండగ రాజభోగాభిలాషవలన నశించినది. ఈ విధముగ మొదటి నలుగురు హంససోదరుల శాపప్రకారము చివరి ముగ్గురు హంససోదరులు రాజమంత్రి పురోహితులుగ జన్మించిరి. మొదటి నలుగురు హంససోదరులు కురుక్షేత్రములో దరిద్ర బ్రాహ్మణగృహమందు బ్రాహ్మణులై జన్మించిరి । మొదటి నలుగురు సోదరులు భరద్వాజపుత్రులుగా ఉన్నప్పుడు గోవధచేసి మాంసముతిన్న మహాపాపులే కాని హంసలుగా ఉన్నప్పుడు జలక్రీడలో ఉన్న రాజదంపతులను చూచి కూడ సప్తమసోదరుని వలే రాజభోగవాంఛ వీరికి కలగలేదు । అంతేకాదు సప్తమహంస సోదరునకు కలిగిన రాజభోగవాంఛను నిందించినవారు అందుచేతనే మొదటి నలుగురు హంససోదరులకు ఉత్తమమయిన దరిద్ర బ్రాహ్మణజన్మ లభించినది. ఈ జన్మచరమజన్మ ఈ విషయములో భగవద్గీతలో ఈ శ్లోకార్థమును చూడుడు.

శ్లో ॥ అథవాయోగి నామేవకులె భవతి ధీమతాం ।
ఏతద్ధిదుర్ల భతరంలోకే జన్మయదీదృ శం ॥ – భ.గీ. 6-42

యోగ భ్రష్టునకు ఏలోకములు లభించును అను ప్రసంగములో చెప్పబడిన రెండువిధానములలో రెండవ విధానమునకు చెందినది ఈ శ్లోకము । యోగమునుండి భ్రష్టుడయిననూ యోగముమహా పుణ్యమయినది కనుక కామనా దోషములేని పక్షములో బ్రహ్మవేత్తలయిన దరిద్రబ్రాహ్మణగృహమందు జన్మలభించును । ఇట్టి జన్మ లభించుట మిక్కిలి దుర్లభము. కారణమేమనగా ఈ జన్మలోనే మోక్షము లభించును మోక్ష ప్రదజన్మలభించుట కష్టముకదా? ఈ జన్మలో ఈ నలుగురు సోదరులకు పూర్వ జన్మస్మృతి

ఉన్నది । వీరు వేదవేదాంగములన్నియు స్మరణమాత్రముచేతనే పొందిరి। వైరాగ్యము, శమాదిషట్కము బ్రహ్మజ్ఞానము వీరికి ప్రాప్తించినవి। అందుచేతనే సమయములో ఈ నలుగురు సోదరులు మహా ప్రస్థానము చేయతలచి తల్లితండ్రులను అనుమతికోరిరి । అంతతల్లి తండ్రులిట్లనిరి ఓ పుత్రులారా! మీరు మాకు శుశ్రూష చేయవలయును మేము మరణించిన తరువాత శ్రాద్ధకర్మ చేయవలయును కనుక మీరు మా సమీపమందే ఉండండి వెళ్లవద్దని చెప్పిరి. అపుడు ఆనలుగురు సోదరులు తల్లితండ్రులతో ఇట్లనిరి, మా వద్ద ధనములేదు శ్రాద్ధకర్మకు ధనము ఆవశ్యకము మీ వద్దకూడ ధనములేదు మీకు ధనము ఇప్పించి మేము మహాప్రస్థానము చేసెదము అని చెప్పి ఈ రెండు శ్లోకములను వ్రాసి ఇచ్చిరి.

శ్లో॥ సప్తవ్యాధా దశార్ణేషు మృగాః కాలాంజనే గిరౌ ।
చక్రవాకాశ్శరద్వీపే హంసా స్సరసి మానసే ॥

శ్లో ॥ యేస్మజాతాః కురుక్షేత్రే బ్రాహ్మణావేద పారగాః ।
ప్రస్థితా దీర్ఘమధ్వానం యూయంతేభ్యోవసీదత ॥

ఈ రెండు శ్లోకములు రాజసమీపములో పఠించవలెను. ఈ శ్లోకార్థము విని మీకు కావలసిన ధనము ఇవ్వగలడు అని చెప్పి నలుగురు సోదరులు మహా ప్రస్థానము చేసిరి. వీరు భరద్వాజ పుత్రులుగా ఉన్నప్పుడు గోమాంసమును పితృదేవతలకు సమర్పించుటచే ఆదానఫలమహిమచే మహా ప్రస్థానముచేసి బ్రహ్మలోకమునకు వెళ్లగలిగిరి ఇది ఇట్లుండనిమ్ము చివరి ముగ్గురు సోదరుల వృత్తాంతమును తల్లితండ్రుల ధనప్రాప్తిని గురించి చూతము.

మొదటివారగు నలుగురు జ్యేష్ఠసోదరుల శాపమువలన చివరి సోదరులు ముగ్గురు రాజమంత్రి పురోహితులై రాజభోగములను అనుభవించుచుండిరి. అంత ఒకరోజున కురుక్షేత్రమందున్న జ్ఞాని సోదరుల తల్లితండ్రులు ఆరెండు శ్లోకములను పఠించుటకై మహారాజాస్థానమునకేగిరి. ఆసమయమున మహారాజు నగరములో లేరు విహారముకొరకు వనమునకేగిరనువార్త విని రాజాగమనమును నిరీక్షించుచు రాజాస్థానములో రెండురోజులుండిరి. వనములో ఉన్న రాజునకు రాత్రి స్వప్నములో గురువు సాక్షాత్కరించి

ఇట్లు చెప్పెను మీరు భరద్వాజ పుత్రులుగా ఉన్నప్పుడు నా గోవు యొక్క మాంసమును భక్షించి గోవు క్రూరమృగములచే అరణ్యమందు భక్షింపబడినదని అబద్ధము చెప్పి ఆ పాపఫలముగా అనేక జన్మలలో దుఃఖములనుభవించుచున్నారు కాని మీ పాపమంతయు ఇప్పుడు నశించినది. ఈ పైన మీకు సుఖములు సంప్రాప్తించగలవు అని స్వప్నములో గురువు అనుగ్రహించెను. ఈ స్వప్నవృత్తాంతమునకు రాజు ఆశ్చర్యమునొందెను తరువాత వనమునుండి రాజు నగరమునకు వచ్చుచుండగ మార్గమధ్యములో కురుక్షేత్రమునుండి వచ్చిన బ్రాహ్మణదంపతులు ఈ రెండు శ్లోకములను పఠించగానే రాజమంత్రి పురోహితులకు జన్మాంతర స్మృతి లభించినది.

ఆ రెండు శ్లోకముల భావమిది.

శ్లో ॥ సప్తవ్యాధాః.........యూయంతే ధ్యేవసీదత ॥

భరద్వాజమహర్షిపుత్రులు గోహత్యాపాపము, గోమాంసభక్షణము, గురువునకు అబద్ధము చెప్పుట, ఈ పాపముల ఫలముగ మొదటి జన్మలో ఏడుగురు సోదరులు దశార్ణదేశములో బోయవారై జన్మించిరి. రెండవజన్మలో కాలాంజన పర్వతమందు జింకలుగా జన్మించిరి । మూడవ జన్మలో శరద్వీపమందు చక్రవాక పక్షులై జన్మించిరి నాలుగవ జన్మలో మానససరోవరమందు హంసలై పుట్టిరి. ఈ హంసజన్మ తరువాత జ్యేష్ఠుడు మున్నగు ప్రథమ సోదరులు నలుగురు కురుక్షేత్రములో బ్రహ్మజ్ఞాని కుటుంబములో బ్రాహ్మణులై జన్మించి వేదవేదాంగవేదాన్త పారంగులయిరి. తరువాతవారు బ్రహ్మజ్ఞానఫలముగ మహాప్రస్థానము చేయుటకై బైలుదేరి అరణ్యములో ఉండిరి. చివరి సోదరులగు మీరు ముగ్గురు అనగా రాజమంత్రి పురోహితులారా? మనగురువు అనుగ్రహమువలన ఇప్పటికి మీకు పాప పరిహారము లభించియుండును కనుక మీ ముగ్గురు అరణ్యములో మమ్ములను కలసినచో మనమందరము మహాప్రస్థానము చేసి బ్రహ్మలోకమునకు వెళ్లగలము అని పై రెండు శ్లోకముల భావము ఈ శ్లోకార్థమును గుర్తించిన రాజు కురుక్షేత్ర బ్రాహ్మణదంపతులకు కావలసినంత ధనమిచ్చి పుత్రులకు రాజ్యమును అప్పచెప్పి వల్కలధారణ చేసి అరణ్యమునకు బైలుదేరిరి అరణ్యములో మహాప్రస్థానమునకై ప్రయాణము చేయుచున్న తమనలుగురు సోదరులను కలిసిరి. రాజమంత్రి పురోహితులు ఈ ముగ్గురు సోదరులు తమకంటె

జ్యేష్ఠులయిన తమ బ్రాహ్మణసోదరుల వలన బ్రహ్మజ్ఞానమునొంది వారితో పాటు ఏడుగురు సోదరులు కలిసి పితృదేవతల అనుగ్రహముచేత బ్రహ్మలోకమునకేగిరి. ఈ ఏడుగురు సోదరులు భరద్వాజ పుత్రులుగా ఉన్నప్పుడు అకృత్యములను చేసిననూ గోమాంసమును పితృదేవతలకు సమర్పించిరి. ఈ ధర్మము కృతాది యుగములలో ఉన్నది అందుచేత ఈ కథావృత్తాంతము కృతాదియుగములకు చెందినదిగ తెలియతగినది. ఈ సోదరులు అకృత్యాచరణవలన కొన్ని జన్మలలో దుఃఖములను భావించిననూ చివరకు పితృదేవతల అనుగ్రహము వలన బ్రహ్మలోకమునకేగిరి. శ్రాద్ధాచరణవలన లభించిన పితృదేవతానుగ్రహమెంత మహాఫలదాయకమో ఈ ఉపాఖ్యానము వలన తెలియబడినది అందురు. శ్రాద్ధాచరణవలన పితృదేవతానుగ్రహమును పొందుదురుగాక. ఈ శ్రాద్ధమహిమోపాఖ్యానము హరి వంశము నుండి స్వీకరించబడినది.

★★★

జీవతో వాక్య కరణాత్
క్షయాహే భూరి భోజనాత్
గయాయాం పిండ దానాచ్చ
త్రిభిః పుత్రస్య పుత్రతా

అన్నదాన మహిమ

శ్రీ కృష్ణ యజుర్వేదీయ అన్నసూక్త విద్యారణ్య భాష్యమునకు

ఆంధ్ర వివరణము

ధ్యాన శ్లోకములు

శ్లో॥ వాగీశాద్యాస్సుమనస స్సర్వార్థానాముపక్రమే ।
యం నత్వా కృతకృత్యా స్స్యుస్తం నమామి గజాననమ్ ॥

శ్లో॥ వేదార్థస్య ప్రకాశేన తమోహార్దం నివారయన్ ।
పుమర్థాంశ్చతురోదేయా ద్విద్యాతీర్థ మహేశ్వరః ॥

శ్లో॥ అవిద్యా భానుసంతప్తో విద్యారణ్య మహంభజే ॥
యదర్క కరతప్తానా మరణ్యం ప్రీతికారణమ్ ॥

మంత్రము - 1

అహమస్మి ప్రథమజా ఋతస్య । పూర్వం దేవేభ్యో అమృతస్య నాభిః ।
యో మా దదాతి సన ఇదేవమా వాః । అహమన్నమన్న మదన్త మద్మి ॥

మానవుల ప్రాణధారణ అన్నాధీనమై ఉన్నది. కనుక ప్రాణ సంరక్షణ చేయునట్టి అన్న స్వరూపమును గురించి తెలుసు కొనుట అత్యవసరమై యున్నది. కృష్ణయజుర్వేద తైత్తిరీయ బ్రాహ్మణ భాగంలో పఠింప బడిన అన్న సూక్తము సాన్నాయ్య యాగమందు వినియోగింప బడినదని కల్పసూత్ర కారులగు మహర్షులు వివరించి ఉన్నారు. లోకములో ప్రాణి వర్గముచే తినబడుచున్న అన్నం మూడు విధములుగా ఉన్నది.

1. సులభముగా తినుటకు సాధ్యమగు వరి, గోధుమ మొదలైనది.
2. ఎక్కువగా దంతముల ప్రయత్నముతో తినుటకు సాధ్యమగు గారె, లడ్డు, దుంపలు మున్నగునవి.
3. సులభముగా భుజించుటకు త్రాగుటకు యోగ్యములగు పాయసము, ఆజ్యము, చారు, పులుసు మున్నగు రస ద్రవ్యములు. ఈ మూడు విధములైన ఆహార

పదార్థాలను అశన, ఖాద్య, పానములు అంటారు. పైన చెప్పబడిన మూడు విధములగు అన్నములకు అభిమాని దేవత యగు అన్న దేవుని వచనములు ఈ అన్నసూక్తము నందు చెప్పబడినవి.

ప్రథమ మంత్రములో అన్నదేవుడు ఇలా చెప్పుచున్నాడు. ఆదిలో యజ్ఞములను సృజించిన వాడను నేనే. అదెట్లనినచో దేవతల కొరకు పురోడాశము, పాలు, పెరుగు, ఆజ్యము మున్నగు అన్నములు యజ్ఞములయందు సమర్పించబడుచుండును. అన్నమును సృజించిన నేను అన్నముల ద్వారా యజ్ఞములను సృష్టించాను. మరియు పూర్వము దేవతలకు అమృత రూపమగు అన్నమును సంపాదించిన వాడను నేనే.

లోకములో ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకరు అన్నదాత మరొకరు అదాత. ప్రథమ వ్యక్తి మహాఫల ప్రాప్తికొరకు ఉత్తమ పాత్రులైన బ్రాహ్మణాదులకు శ్రద్ధాభక్తితో త్రివిధ అన్నములను సమర్పించుచున్నాడు. దాత ఇప్పుడు ఎంత అన్నదానము చేయునో, కాలాన్తరమందు అతనికి ఆ అన్నము వేయిరెట్లు వృద్ధిచెందుతుంది. దాత అన్నదానం ద్వారా కాలాన్తరమందు అన్నదేవుడనైన నన్ను భుజించుట కొరకు ఇప్పుడు నన్ను స్వాధీన పరుచుకొనుచున్నాడని భావము. రెండో పురుషుడు నన్ను దానము చేయక స్వయముగా ఒక్కడే అన్నమును తింటున్నాడు. అదాత అన్నమును నేనే తింటున్నానని అనుకొంటున్నాడు. కాని అతనిని నేనే భక్షిస్తున్నాను. అన్నదానము చేయకపోవుటచేత కాలాంతర మందు అదాత అన్నములేని వాడవుతున్నాడు. అన్నము లేకపోతే ప్రాణము పోతుంది గదా? అదే అతనిని నేను భక్షణచేయడమంటే. ఈ రహస్యమతనికి తెలియదు.

విశేష వివరణ-

అన్నదానము మానవులకే కాదు దేవతలకు కూడా చేయాలి. మంత్రోచ్చారణచే మనమిచ్చిన ఆజ్యాన్న పురోడాశాది ద్రవ్యములను దేవతలు స్వీకరించి మనకు కావలసిన పుత్ర, మిత్ర, కళత్ర, ధనధాన్యాది సంపదను అనుగ్రహిస్తున్నారు. ఇలా ఉపకారము చేసే దేవతలకు హవిర్భాగములివ్వక స్వశరీర పుష్టికొరకే ఆహారము తినుచున్న వానిని గూర్చి ఈ క్రింద ఉదహరించిన భగవద్గీతా శ్లోకములో కృష్ణ పరమాత్మ ఇలా చెపుతున్నారు.

శ్లో॥ ఇష్టాన్ భోగవాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞ భావితాః ।
తైర్దత్తాన ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవసః ॥

అనగా దేవతలిచ్చిన అన్నాది ద్రవ్యములను వారికి సమర్పించక భుజించు వాడు దొంగవంటి వాడు.

మరియు యజ్ఞయాగాది కర్మానుష్ఠానములలో దేవతలకు ఇవ్వగా శేషించిన అన్నమును అమృతమంటారు. బ్రాహ్మణులకు సమర్పింపగా శేషించిన అన్నమును విఘసమంటారు. ఈ రెండు విధములైన అన్నములను భుజించిన వారికి సర్వ పాపాలు తొలగిపోతాయి. దేవ బ్రాహ్మణులకు సమర్పించక కేవలము తన కొరకే అన్నమును వండుకొని భుజించు వానిని గురించి శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇట్లు చెప్పారు.

శ్లో॥ యజ్ఞశిష్టాశినస్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।
భుజంతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్ ॥

దానము చేయక తానే భుజించువాడు అన్నమును భుజించుట లేదు పాపమునే భుజిస్తున్నాడు.

లోక దృష్టిలో అది అన్నముగా కనబడిననూ, శాస్త్ర దృష్టిలోనూ దేవతా దృష్టిలోనూ అది పాపమే. పాప రూపముగా ఉన్న అన్నమును తింటున్నాడని గీతా రహస్యము.

2వ మంత్రము

పూర్వమగ్నే రపి దహత్యన్నమ్ । యత్తౌ హాసాతే అహముత్తరేషు ॥
వ్యాత్తమస్య పశవస్సుజంభమ్ ।పశ్యన్తి ధీరాః ప్రచరన్తి పాకాః ॥

మనము తింటున్న ఆహారాన్ని ఉదరంలో ఉన్న జఠరాగ్ని పచనము చేయుటకు ఒక పూట సమయము కావాలి. కాని అన్నదానము చేయక తాను మాత్రమే తినుచున్న వాణ్ణి దహించటంలో అన్న దేవునకు ఒకపూట సమయము అవసరం లేదు. అన్నదేవుడు అదాతను వెంటనే దహించేస్తాడు. లోక దృష్టిలో అదాత దాతలాగా కనబడిననూ, అదాతకు దానము చేయక భోజనము చేయు క్షణమందే పాపము వస్తోంది. ఆ పాపము వలన అతనికి కాలాంతరములో నరక ప్రాప్తి సంభవిస్తుంది అందుకే **"అదాతా విష మశ్నుతే"**

అని పెద్దలంటారు. అనగా అదాత అన్నము తినుట లేదు, విష రూపమయిన అన్నమును తింటున్నాడని భావము.

అన్నదాత, అదాత ఉభయులూ వారి వారి ప్రయత్నములు చేస్తున్నారు. దాత అన్నదానము చేయుట కొరకు ఉత్తమ పాత్రులను సంపాదించుటకై ప్రయత్నము చేస్తున్నాడు. అదాత ఎవరికీ పెట్టుటకు ఇష్టంలేక భోజనము చేయుటకు ఎవరూ లేని చోటు కొరకు ప్రయత్నము చేస్తున్నాడు. వీరి విషయములో అన్న దేవుడు ఇలా అంటున్నాడు.

ఎవరు అన్నదానము చేస్తున్నారో అలాగే అన్నదానము చేసేవారికి సర్వ విధముల సహాయం చేస్తున్నారో, అట్టి వారు సర్వోత్తములు. అట్టివారికి నేను ఎల్లప్పుడు అన్న సమృద్ధిని కలుగచేస్తాను. ఎవరు నన్ను దానము చేయక తినుచున్నారో అట్టివారు పశువులతో సమానులు, మూఢులు. అటువంటివారిని తినుటకు నేను తీవ్రమైన కోరలు గల నా ముఖాన్ని తెరచుకొని సిద్ధంగా ఉంటాను. ఈ విధముగా చెపుతున్న అన్నదేవుని అభిప్రాయమును కొంత మందే తెలుసుకొంటున్నారు. వారు బుద్ధిమంతులు. ధీరులు. వారే అన్నదాతలు. పైన చెప్పిన అన్నదేవుని అభిప్రాయమును తెలుసు కోలేని వారు అజ్ఞానులు, మూర్ఖులు.

విశేష వివరణ-

మనముతిన్న అన్నమును ఉదరమందున్న జఠరాగ్ని జీర్ణము చేయును. ఈ అగ్నిని వైశ్వానరాగ్ని అంటారు. ఈ విషయము భగవద్గీతయందు చెప్పబడినది.

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

పరమేశ్వరుడు జఠరాగ్ని రూపముగా సర్వ ప్రాణుల ఉదర మందు ప్రవేశించి వారు నిత్యమూ సేవిస్తున్న భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య అహారములను మరల పచనము చేస్తున్నాడు. ఈ చతుర్విధ పదార్థముల విశేషములు ఇట్లున్నవి.

1. **భక్ష్యములు** - దంతవ్యాపార సాధ్యములైనవి. లడ్డు, గారె, దుంపలు మున్నగునవి.
2. **భోజ్యములు** - పాయసము అన్నము మున్నగునవి.

3. **లేహ్యములు** – తేనె, బెల్లంపాకం, అల్లం పచ్చడి మున్నగునవి నాలుకతో చప్పరించుటకు వీలగునవి.

4. **చోష్యములు** – పులుసు, చారు, మజ్జిగ మున్నగునవి (పుక్కిలింతతో స్వీకరించుటకు సాధ్యమగునవి). ఈ చతుర్విధ ఆహార ద్రవ్యములను సోమదృష్టితో చూడవలెను. సోముడనగా చంద్రుడు. మనచే తినబడుచున్న సర్వ పదార్థములు రాత్రియందు చంద్రుని అమృత కిరణ సంపర్కము చేతనే వృద్ధిచెంది, అమృతము వలె రుచికరములై భక్షణ యోగ్యములగుచున్నవి. ఈ విషయములో గీతాచార్యులు భగవద్గీతలో ఇలా అన్నారు.

పుష్ణామిచౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః ।

నేను అమృత స్వరూపముతో చంద్రుడనై, కిరణముల ద్వారా ఓషధుల యందు ప్రవేశించి ఓషధులను నా అమృత స్వరూపంతో వృద్ధి పొందించుచున్నాను. పరమేశ్వరుడు చంద్ర స్వరూపముతో ఆహారమును సృష్టించి, వృద్ధి చేస్తున్నాడు. జఠరాగ్ని స్వరూపంలో భుజించిన ఆహారమును పచనము చేస్తున్నాడు. ఈ విధంగా అగ్ని, సోములచేతనే జగద్వ్యవహారము నడుస్తోంది. కనుక అగ్ని సోములే ఈ జగత్తు అని ధ్యానము చేసినచో అన్నదోషము ఉండదు. అన్నదాతకు సంబంధించిన దోషము అన్నమందున్ననూ, ఈ ధ్యాన ప్రభావంచేత భోక్తకు అన్నదోషము సంక్రమించదని శంకర భగవత్పాదులు ఈ ఉపాసనా రహస్యమును తన భాష్యములో ఇట్లు విశదీకరించిరి:

భోక్తా వైశ్వానరోగ్నిః । భోజ్యమన్నం సోమః ।
తదేతదుభయ మగ్నీషోమౌ సర్వమితి పశ్యతః అన్నదోష లేశో న భవతి ।

ఇక్కడ మరొక విశేషాన్ని గ్రహించాలి, పైన ఉదహరించినట్లుగా మరొక విధముగా నాలుగు విధములగు ఆహారాలు ఉన్నాయి.

1. పార్థివాహారము
2. జలమయ ఆహారము
3. వాయురూప ఆహారము

4. తేజోరూప ఆహారము.

ఈ ఆహారాలను భుజించు ప్రాణి వర్గము కూడా నాలుగు విధములుగా ఉన్నవి.

1. పార్థివాహారమనగా భూలోకమందు లభించు భక్ష్య భోజ్య లేహ్య చోష్య ద్రవ్యములు. వీట్లను భుజించు వారు మానవులు.

2. జలమే ఆహారము చాతక పక్షికి. ఈ పక్షి అన్తరిక్షము నుండి మేఘము ద్వారా లభించు వర్షజల బిందువుల తోనే జీవిస్తుంది.

3. సర్పాదులు గాలినే ఆహారంగా స్వీకరిస్తాయి.

4. చకోర పక్షులు వెన్నెల తిని జీవిస్తున్నాయి. వాలఖిల్యాది మహర్షులు సూర్య కిరణాలను ఆహారంగా తీసుకుని జీవించారని గ్రంథాలు చెపుతున్నాయి. చంద్ర కిరణాలు, సూర్య కిరణాలు తేజో రూపమైన ఆహారము.

పైన ఉదహరించిన ప్రాణివర్గ మందు ప్రవేశించిన పరమేశ్వరుడు జఠరాగ్ని రూపముతో పైన ఉదహరించిన చతుర్విధ ఆహారములను జీర్ణము చేస్తున్నాడు. ఇలా పచనము చేయగా లభించిన స్థూల పదార్థము మల మూత్ర రూపముగా బహిర్గతమౌతుంది. సూక్ష్మ భాగము వాక్కునకు, మనస్సునకు, ప్రాణమునకు శక్తిని సంపాదించునవి అని ఛాందోగ్యోపనిషత్తు చెపుతోంది. పరమేశ్వరుడే అగ్ని సోమ స్వరూపుడై జగత్తునంతటనూ వ్యాపించి ఉండగా పరమేశ్వరుడు లేడను వాదము సాహసోపేతమై ఉండును. నిష్ప్రమాణమని భావము.

3వ మంత్రము -

జహామ్యన్యం నజహామ్యన్యమ్ । అహమన్నం వశమిచ్ఛరామి ॥
సమాన మర్థం పర్యేమి భుంజత్ । కోమామన్నం మనుష్యోదయేత ॥

అన్నదేవుడనైన నేను అదాతను పరిత్యజిస్తున్నాను. అన్నదాతను పరిత్యజించను. అన్నదాతను నావాడిగా చేసుకొంటాను. అనగా అన్నదేవుడు అన్నదాతకు స్వాధీనుడై ఉంటాడని భావము. లోకములో ఏమానవుడు భోగమునకు, దానమునకు సమానముగా ధనమును ఆర్జించుచున్నాడో అట్టి వానికి నేను సర్వవిధములా రక్షణ కల్పించగలను. ఏ

మానవుడు భోగము కొరకే సంపాదించునో దానము కొరకు ధనమును సంపాదించడో వానిని నేను రక్షించను, పొందను, పైగా పరిత్యజిస్తాను. ఇలా అదాతను పరిత్యజిస్తూ, దాతను రక్షిస్తూ, దాత పట్ల పక్షపాతము చూపిస్తున్న నన్ను లోకములో ఎవరు నివారించగలరు? నివారించుటకు ఎవరూ సమర్థులు కారని అన్నదేవుని స్వాతంత్ర్య ప్రకటన ఇందులో తెలుస్తోంది.

విశేష వివరణము -

అన్నదానము ప్రశస్తమని భాష్య వివరణ వల్ల తెలుస్తోంది. కాని దానమెలా చేయాలి? దానాలు ఎన్ని విధాలు? ఏ దానము ప్రశస్తము? అనే విషయంలో భగవద్గీతలో గీతాచార్యులు సెలవిచ్చారు.

శ్లో॥ దాతవ్యమితి యద్దానం దీయతేనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్వికం స్మృతం ॥

దానము స్వీకరించువాని నుండి ప్రత్యుపకారమును అపేక్షించక దేశ కాల పాత్రలను ఎరిగి చేయు దానము సాత్విక దాన మనబడును.

శ్లో॥ యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతం ॥

ప్రత్యుపకార బుద్ధితో గానీ ఫలాపేక్ష కలిగి కానీ బాధపడుచూగానీ చేయుదానము రాజస దానమని చెప్పబడినది.

శ్లో॥ అదేశ కాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే ।
అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదాహృతం ॥

దేశ కాల పాత్రలతో సంబంధంలేక అగౌరవంగా అవమాన పూర్వకంగా చేయు దానము తామస దానమని చెప్పబడును.

ఆహారము కూడా సాత్విక, రాజస, తామస బేధములతో మూడు విధములని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇట్లు బోధించారు-

శ్లో॥ ఆయుస్సత్వ బలారోగ్య సుఖ ప్రీతి వివర్ధనాః ।
రస్యాస్స్నిగ్ధా స్థిరా హృద్యా ఆహారా స్సాత్విక ప్రియాః ॥

చిరకాల జీవనాన్ని, మనస్సునకు ధైర్యమును, స్థైర్యమును, ఉత్సాహమును అనగా ప్రబల దుఃఖ మేర్పడిననూ నిర్వికారముగా ఉండుట, శరీరేంద్రియ సామర్థ్యమును, వ్యాధిలేకపోవుటను, భోజనానంతరము తృప్తిని, భోజనకాల మందు ఆహారాభిరుచిని వృద్ధిచేయు ఆహార పదార్థములు; మధురరస ప్రధానమయిన ఫలములు, పటికబెల్లము, పంచదార వీటితో తయారు చేయబడిన పిండి వంటలు, స్నేహపదార్థములు అనగా చిక్కని పాలతో నూనెతో నేతితో తయారయిన పిండి వంటలు; ఏ ఆహార పదార్థములు, భుజించిన తరువాత శరీరమందు చాలా కాలము శరీరేంద్రియాదులకు బల సంపాదకములగునో అట్టి కంద మూలాది ఆహార పదార్థములు మరియు దుర్గంధము అపవిత్రత లేని ఆహార పదార్థములు సాత్వికాహారములు ఇవి మానవునకు చిత్త సత్వ సంపాదకములు. సత్వము జ్ఞాన సంపాదకమై మోక్ష దాయకమగును. అందుచేత సాత్వికాహారములనే సేవించాలి. పైన చెప్పబడిన ఆహారమును సేవించు మానవుడు సాత్వికుడని గ్రహించ వచ్చును.

శ్లో॥ కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః ।
ఆహారా రాజస స్యేష్టా దుఃఖ శోకామయ ప్రదాః ॥

కటుశబ్ద మునకు కారము అని అర్థము, కాని ఈ శ్లోకములో చేదు అని అర్థము చెప్పాలి. తీక్ష్ణ శబ్దముచే కారము అని అర్థము చెప్పబడుచున్నది. అమ్ల మనగా పులుపు. లవణము తెలిసినదే. ఉష్ణము-వేడివేడి పదార్థము. రూక్షము- చమురు లేని పదార్థము, విదాహీ- దాహమును కలుగజేయునవి- ఆవాలు మొదలైనవి. ఇవన్నీ మితముగా భుజించవచ్చును. కాని శ్లోకమందున్న అతి శబ్దము ఈ ఏడు ఆహార పదార్థములతో సంయోజన చేయ వలయును. అతి శబ్దమునకు మిక్కిలి అని అర్థము.

1. మిక్కిలి చేదు-వేప
2. మిక్కిలి పులుపు-నిమ్మ
3. మిక్కిలి ఉప్పు
4. ఎక్కువ వేడి అనగా చేతులు నోరు కాలే పదార్థములు.
5. అతి తీక్ష్ణం-అపరిమిత కారముకల మిరియము మొదలగునవి.

6. అతి రూక్షం - ఏ కొంచెము చమురు లేని కొర్రలు. అళ్లు మున్నగునవి.
7. అతి దాహ- మిక్కిలి దాహమునిచ్చు ఆవపిండి మున్నగు పదార్థములు.

రాజస ఆహార పదార్థములను సేవించు వానికి వెంటనే దుఃఖము తరువాత శోకము రోగము ప్రాప్తించును. రాజసాహారము భుజించు వారికి రజోగుణము వృద్ధి చెందును. రాజసాహారమును సేవించు వారిని రాజసులంటారు.

శ్లో॥ యాతయామం, గతరసం, పూతి, పర్యుషితం, చ యత్ ।
ఉచ్ఛిష్టమపి చా మేధ్యం భోజనం తామస ప్రియం ॥

అర్ధ పక్వము-సగం ఉడికిన పదార్థము, ఎక్కువగా ఉడికిన పదార్థము, దుర్గంధోపేతం-పాసి పోయినవి, ఉచ్ఛిష్టం-ఇతరులు తినగా వారి ఎంగిలి, యజ్ఞములకు అనర్హమయిన ఉల్లిపాయి మున్నగు ఆహార పదార్థములు తామస వ్యక్తులకు ప్రియమైన ఆహారము. తామసాహారమును సేవించినచో తమో గుణము వృద్ధి చెందును. వీరిని తామసులంటారు. ఉత్తమ శ్రేయస్సును అభిలషించు ముముక్షువులు రాజస, తామస ఆహారములను పరిత్యజించి సర్వకాల సర్వావస్థలయందు సాత్వికాహారమును, సాత్విక దానములను చేయవలెను. సత్వాభివృద్ధికై సాత్వికాన్నమును భుజించుట, సాత్వికాన్నదానము చేయుట ఉత్తమ లక్షణం.

4వ మంత్రము -

పరాకే అన్నం నిహితం లోక ఏతత్ । విశ్వైర్దేవైః పితృభిర్గుప్త మన్నం ॥
యద్దద్యతే లుప్యతే యత్పరోప్యతే । శతతమీ సా తనూర్మే బభూవ ॥

అన్నదేవుని మహాత్మ్యము ఈ మంత్రంలో చెప్పబడుతోంది. అన్న వ్యవహారము లోకంలో రెండు విధాలుగా చూడబడుతోంది.

1. పారలౌకిక వ్యవహారము
2. ఐహిక వ్యవహారము

అన్నదాత పితృదేవతాది లోకాలలో నాకు అన్నసమృద్ధి కలుగుగాక అనే భావంతో ఉత్తమ పాత్రులైన వారికి అన్నదానం చేస్తున్నాడు. భూలోకంలో అగ్నియందు,

బ్రాహ్మణులయందు సమర్పించిన అన్నము భూలోకానికి మిక్కిలి దూరంలో ఉన్న పితృ దేవతాది లోకాల్లో ఉన్న దేవతలకూ, పితృదేవతలకూ సంక్రమిస్తుంది. భక్తి శ్రద్ధలతో మనమిచ్చిన అన్నాన్ని దేవతలు ఆదరంతో స్వీకరించి ఈ అన్నదాన ఫలాన్ని అన్నదాత స్వర్గలోకానికి వచ్చేవరకూ రక్షించి, దాతకు సమర్పిస్తారు. ఇది పారలౌకిక అన్న వ్యవహారము.

ఇక ఐహిక అన్నవ్యవహారాన్ని చూద్దాం. ఐహిక వ్యవహారము అనేకరకాలుగా కనబడుతోంది.

దానములేక తనకు తానే భుజించటం. భుజించిన దాన్ని జఠరాగ్ని దహింప చేస్తున్నాడు కనుక నశించింది అనటం. మాడి పోయిన అన్నము వాసన వచ్చిన అన్నము.

మాడిన అన్నాన్ని వాసన వచ్చినదాన్ని వీధిలో పారవేయటం, ఈవిధంగా చేయటం తన ఐశ్వర్యమింతది అని ప్రకటన చేయటమే కానీ ప్రయోజనకారి కాదు. ఇది ఐహికాన్న వ్యవహారము. ఇట్లు ఐహికాముష్మిక వ్యవహారమంతా అన్నదేవుని మహిమలో శత సంఖ్యాలేశము అని అన్నదేవుని ప్రకటన. ఇదంతా అన్నదేవుని మహిమలో నూరవలేశమైతే అన్నదేవుని మహిమ ఎంతటిదో మనము తెలుసుకోలేము.

విశేష వివరణ -

శరీరేంద్రియ పుష్టిని, ధనధాన్య పుష్టిని కాంక్షించిన వైశ్వదేవ కర్మానుష్ఠాత నిత్యము భూత బలిని ఇస్తూ ఉంటాడు. ఈ విషయంలో వినియోగింపబడే మంత్రానికి విద్యారణ్య భాష్య ఆంధ్రానువాదాన్ని చూడండి.

> యే భూతాః ప్రచరన్తి దివానక్తం బలి మిచ్ఛన్తో వితుదస్య ప్రేష్యాః ।
> తేభ్యో బలిం పుష్టికామో హరామి మయి పుష్టిం పుష్టిపతిర్దధాతు స్వాహా ॥

శరీరేంద్రియ పుష్టిని, ధన ధాన్య పుష్టిని, కాంక్షించిన నేను అన్నము కొరకు గ్రద్ద మున్నగు భూతముల కొరకు, అన్నమును బలి విధానముగా భూమియందు ఉంచుచున్నాను. శ్మశానవాసియైన కాలాగ్ని రుద్రుడు అన్నదానం చేయని పాపులను పీడించటం కోసం కొంత మంది దూతలను పంపుతాడు. గ్రద్ద, నక్క, యుద్ధమందు

ఆసక్తిగల మేక–పొట్టేలు (దీనిని భయేడక మంటారు), ఆడగాడిద (దీనిని దీర్ఘముఖి అంటారు) ఈ జంతువులన్నీ యమదూతలని ఆరణ్యక భాగంలో మంత్ర బ్రాహ్మణంలో చెప్పబడింది. వీనిలో కొన్ని, నక్క, మేక, గాడిదా మొదలైనవి భూలోకంలో నివసిస్తాయి. గ్రహములు అన్తరిక్ష లోకంలో నివసించేవి. వీట్ల కొరకు భూమియందుంచిన బలి అన్నాన్ని ఆ భూతాలు తిని తృప్తి చెంది, అన్నదాతను ఏమీ చేయవు. అహోరాత్రములు అన్నము కొరకు సంచరించు తన భృత్యులకు బల్యన్నమును దానము చేసిన అన్నదాతకు తన భృత్యుల వలన ఎట్టి మరణమూ లేకుండు నట్లు రుద్రుడు చూస్తాడు. మరియు పుష్టిపతి, ధనధాన్యపతి, పోషణపతి అయిన శంకరుడు బల్యన్న దాతకు ధనధాన్య శరీరేంద్రియ పుష్టిని కలుగ జేసి రక్షిస్తూ ఉంటాడు. ఇది వేదరహస్యం.

5వ మంత్రము –

మహాన్తా చరూ సకృద్దుగ్ధేన పప్రౌ । దివంచ పృశ్ని పృథివీంచ సాకమ్ ।
తత్సంపిబన్తో న మినన్తి వేధసః । నైతద్భూయో భవతి నో కనీయః ॥

అన్నదేవుని మహిమ ఈ మంత్రంలో ఈ విధంగా చెప్పబడుతోంది. బహు క్షీరము కల గోవును పితుకగా వచ్చిన క్షీరంతో రెండు కడవలు నిండిపోతాయి. అలాగే స్వల్పంగానైనా మంత్రములచే పవిత్రమయిన అన్నము భక్తి శ్రద్ధలతో అగ్నియందూ, ఉత్తమ పాత్రుని యందూ, సమర్పించబడిన అన్నము భూలోకాన్నీ స్వర్గలోకాన్నీ పూరించి, అన్నదాతకు లోక ద్వయము అన్నపూర్ణ– మయ్యేట్టు చేస్తుంది. అన్నదాతకు భూలోకంలోనూ, స్వర్గలోకంలోనూ అన్నానికి లోటుండదని భావము. బ్రాహ్మణులకూ, దేవతలకూ, అన్నదానము చేయగా మిగిలిన అన్నము విఘసమని, అమృతమని చెప్పబడుతోంది. ఈ అన్నమును భుజించిన అన్నదాత అన్నమును నాశనము చేసిన వాడు కాడు. తనను కూడా నశింప చేసుకున్నవాడు కాడు. కారణమేమనగా అన్నదాన ప్రభావంచేత అన్నము వృద్ధి చెంది తన భోజనమునకు సర్వకాలముల యందు అన్నము సిద్ధముగా ఉండును. అన్నములేక ప్రాణము పోయినది అనుమాట అన్నదాతకు ఉండదు. అందుచేత అన్నదాత తన ఆత్మ సంరక్షణ చేసుకున్న వాడగును. లోకములో మిక్కుటముగా అన్నము భుజించిన వానికి అజీర్ణ వ్యాధి సంభవించును. తక్కువగా భుజించిన వారికి ఆకలి తీరదు. ఈ

రెండు దోషములూ అన్నదాతకు ఉండవు. కారణమేమనిన అన్నదాన ప్రభావము చేత అన్నదానానంతరము భుజించిన అన్నము అన్నదాతకు ఔషధి వంటిదౌతుంది.

విశేష వివరణము -

ఈ మంత్రభాష్య వివరణలో స్వల్పముగా దానము చేయబడిన అన్నము భూలోకాన్ని, స్వర్గలోకాన్ని పూరిస్తుందని చెప్పబడింది. అదెలా సాధ్యం? దానం చేసిన అన్నం స్వల్పం గదా? లోకద్వయము విశాల మయినది కదా? అనే శంకకు యావదేకా అను శ్రుతి భాష్యంలో శ్రీ విద్యారణ్య స్వామి ఈ విధంగా సమాధానం చెప్పారు-

యావదేకాదేవతా కామయతే యావదేకా । తావదాహుతిః ప్రథతే ।
నహి తదస్తి । యత్తావ దేవస్యాత్ । యావజ్జుహోతి ॥

ఆయా దేవతలను ఉద్దేశించి మంత్రోచ్చారణ పూర్వకముగా అగ్ని యందు మనము సాధారణముగా రేగు పండు వంటి పరిమితమగు హవిస్సును హోమము చేస్తున్నాము, కాని ఆ ద్రవ్యము అంత మాత్రముగానే దేవతను పొందదు. మంత్రోచ్చారణ ప్రభావంచేత ఆయాదేవతలకు ఎంత కావాలో అంతగా వృద్ధి చెంది ఆయా దేవతలను పొందుతోంది. అలాగే హవిస్సు స్వల్పమయినాకూడా పృథివీలోకాన్నీ స్వర్గలోకాన్నీ వ్యాపించటం సమంజసమే. ఈ విషయములో మరియొక శ్రుతి మరొక దృష్టాన్తరమును విశదీకరించింది.

అథౌషధీ రన్తగతా దహతి తాస్తతో భూయసీః ప్రజాయన్తే ॥

అనగా అగ్నియందు సాయంప్రాతః కాలాల్లో హోమము చేయబడే అన్న, ఆజ్య, సమిత్, పురోడాశాది హవిస్సు మనము చూస్తుండగానే దగ్ధమైపోతోంది. కాని అది మనకు నిలవ ఉన్న ధనమని, అభివృద్ధి చెందేదని శ్రుతి బోధిస్తోంది. వ్యవసాయదారులు చెరుకు తోటను దగ్ధము చేస్తారు. అది దాహానంతరము అభివృద్ధి చెందినట్లు అగ్ని యందుంచిన హవిస్సు కూడా అభివృద్ధి చెందును. ఇక్కడ భక్తి శ్రద్ధలు అత్యావశ్యకములై ఉన్నాయి. ఈ విషయములో భగవద్గీతలో కృష్ణ పరమాత్మ-

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి ।

తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥

భక్తి శ్రద్ధలతో ఇచ్చినది పత్రమైనను, పుష్పమైననూ, ఫలమైననూ నేను స్వీకరించి దాతను అనుగ్రహిస్తాను. పాండవులను కృష్ణపరమాత్మ ఇట్లనుగ్రహించెను.

పాండవులు అరణ్య వాసము చేయు కాలములో అకాలమందు భోజనార్థమై వేల శిష్యులతో దుర్వాస మహర్షి పాండవుల వద్దకు వచ్చాడు. వెంటనే ధర్మరాజు భోజనానికై స్నానము చేసి రమ్మనమని సవినయముగా కోరాడు. అంత దుర్వాస మహర్షి శిష్యులతో నదీ స్నానమునకు వెళ్లెను. పతివ్రతా శిరోమణి ద్రౌపదీ దేవి ఆపద్బాంధవుడగు శ్రీ కృష్ణుని స్మరించింది. శ్రీ కృష్ణుడు సాక్షాత్కరించెను. భోజనానంతరము కడిగి బోర్లించిన అక్షయ పాత్రయందు ఒకానొక కూర ముక్క దొరికినది. దానిని భక్తితో శ్రీ కృష్ణునకు ద్రౌపదీ దేవి సమర్పించగా తన ఉదరమందున్న సర్వ బ్రహ్మాండములతో సహా తృప్తి చెందాడు. సర్వ బ్రహ్మాండములలో ఒక భాగమందున్న శిష్యులతో కూడిన దూర్వాస మహర్షి కూడా తృప్తి చెందెను. ధర్మరాజు వద్దకు వెళ్లినచో భోజనము చేయమని ప్రార్థిస్తాడు. మనము ఈపైన భోజనము చేయలేము. ఉదరములో చోటు లేదు అని దుర్వాస మహర్షి తిరిగి తన ఆశ్రమానికి వెళ్లి పోయాడు. ఈ ఘట్టాన్ని మహాత్ములు ఒక్క శ్లోకంలో పొందు పగిచారు.

శ్లో॥ ద్రౌపదీ శాకమాసాద్య త్రిలోకీ యేన తర్పితా ।
తజ్జీవ బ్రహ్మణో రైక్యే బ్రహ్మైవ నో హరిః ॥

భక్తి శ్రద్ధలతో చేసిన అన్నదానము అనన్త ఫల ప్రదమని తెలుసుకోవాలి.

పై మంత్రార్థములో అన్నదానానంతరము దాత భుజించిన అన్నము అనారోగ్య కారణము కాదని చెప్పారు, అదెలా సంభవం? అన్న ప్రశ్నకు భాష్యకారులు భగద్గీతా శ్లోకంతో సమాధానము చెప్పారు.

నాత్యశ్నతస్తు యోగోస్తి నచైకాన్త మనశ్నతః

యోగి తన యోగాభ్యాస కాలమందు ఆహార నియమము కలవాడు కావాలి. ఎక్కువగా ఆహారాన్ని స్వీకరించినా, తక్కువగా ఆహారము స్వీకరించినా యోగము సిద్ధించదు. మితముగా భుజించాలి, మితముగా భుజించు వానికి యోగ సిద్ధి మరియు వేదాన్త శ్రవణము బ్రహ్మచర్యము కూడ సిద్ధిస్తాయి. అన్నదాన మహిమ చేత అన్నదానంతరము భుజించిన

అన్నము అన్నదాతకు ఆరోగ్య కారణమై యోగాభ్యాసమునకు యోగ్యమై యుండును. అనగా అన్నదాత యోగ ప్రాప్తికి, వేదాన్త శ్రవణమునకు, బ్రహ్మచర్య సిద్ధికి, తగినట్లే భుజించునని భావము. అట్టి వానిని అన్నదేవుడు లోకద్వయమందు సర్వదా రక్షిస్తుంటాడని భావము.

6వ మంత్రము -

అన్నం ప్రాణ మన్న మపాన మాహుః ।
అన్నం మృత్యుం తము జీవాతుమాహుః॥
అన్నం బ్రహ్మణో జరసం వదన్తి ।
అన్నమాహుః ప్రజననం ప్రజానామ్ ॥

అన్నదేవుని మహిమ మళ్లీ వర్ణింపబడుతోంది. అన్నదేవుడు సమస్త జగద్వ్యవహారమునకు కారణమై ఉన్నాడు. అదెట్లనగా ప్రాణుల శరీరముల యందు వాయు సంచారము రెండు విధములుగా ఉన్నది.

1. ప్రాణవాయువు పైకి సంచరించుట.
2. అపానవాయువు క్రిందకి సంచరించుట.

ప్రాణాపాన వాయు సంచారము అన్న బలము చేతనే జరుగుతోంది. అన్నము లేని వానికి ప్రాణాలే పోతాయి. అందుచేత ప్రాణాపాన వాయువులు అన్న స్వరూపములని చెప్పబడుతున్నాయి. మరియు అన్నము ఒకప్పుడు మృత్యువుగానూ, ఒకప్పుడు జీవనంగానూ పరిణమిస్తోంది. తిన్న అన్నము జీర్ణం కానిచో రస వైషమ్యాన్ని పొంది వ్యాధిని సృష్టించి తద్వారా మృత్యు కారణమవుతోంది. మరియు అన్నము ఔషధంలాగా ప్రాణ సంరక్షణ చేస్తోంది. అందుచేత జీవన కారణమగుచున్నది. అన్నము ఒకానొక సమయమందు శరీరేంద్రియ పుష్టిని కలిగించి సంతానోత్పత్తికి కూడా కారణమవుతోంది. మరొక సమయమందు ఒకానొక అన్న విశేషము తన భక్షణ చేత జుట్టు నెరసిపోవుట, శరీరము ముడతలు పడుట ఇట్టి ముసలితనమును సంపాదించుచున్నది. ఆహార పదార్థములలో ఇట్టి తారతమ్యాలను సృష్టించగల శక్తి ఉన్నదని ఆయుర్వేద శాస్త్రాభిజ్ఞులు చెబుతున్నారు.

విశేష వివరణ-

తైత్తిరీయోపనిషత్తులో యేన్నం బ్రహ్మోపాసతే అనే మంత్రం అన్న బ్రహ్మోపాసనను చెబుతోంది. అనగా అన్నమును బ్రహ్మగా భావించాలి అని అర్థం. అన్నము బ్రహ్మ ఎలా అవుతుంది? అని సందేహము.

కాని బ్రహ్మ ఎలాగైతే జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేస్తున్నాడో అదేవిధంగా అన్నము కూడా సృష్టి, స్థితి, లయములను చేస్తున్నది. అదెట్లనగా అన్నము భుజించినచో శరీరేంద్రియ పుష్టి కలిగి తద్వారా ప్రాణులు జన్మిస్తున్నారు. జన్మించిన ప్రాణులు అన్నము వలననే బ్రతుకుతున్నారు. అన్నమే ఒకానొక సమయమున అజీర్ణాది వ్యాధి ద్వారా మరణ కారణమగుచున్నది. అందుచేత అన్నము కూడ ప్రాణివర్గము యొక్క సృష్టి స్థితి లయములకు కారణమగుట చేత అన్నమును బ్రహ్మగా భావించమని ఉపనిషన్మర్యాద. అందుచేతనే **అద్యతేత్తిచ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి,** అను తైత్తిరీయోపనిషత్తు అన్న శబ్దమును ఇట్లు నిరూపిస్తోంది- ముందుగా ప్రాణులచే తినబడేది కనుక అన్నమనియూ, తరువాత ప్రాణులను తనే తినేది కనుక అన్నమని అన్న శబ్ద నిర్వచనము రెండు విధములుగా బోధించబడినది.

7వ మంత్రము -

మోఘమన్నం విన్దతే అప్రచేతాః। సత్యం బ్రవీమి వధ ఇత్సతస్య।
నార్యమణం పుష్యతి నో సఖాయం। కేవలాఘోభవతి కేవలాదీ ॥

అన్నదేవుడు ఇట్లు బోధిస్తున్నాడు. అన్నదానము చేయనివాడు వివేక శూన్యుడు. అతను వ్యర్థముగా ధనార్జన చేసి ఆహార పదార్థములు పొందుచున్నాడు. అదాత అన్నదానము చేయక పోవుట చేత తన వద్ద వున్న ఆహార పదార్థములను వధిస్తున్నాడు. ఈ విషయము సత్యము. సత్యమునే నేను చెపుతున్నాను. అదాత (దానము చేయనివాడు) అర్యమాది దేవతలకు, మిత్రులకు అన్నదానము చేసి తృప్తిని కలుగచేయలేకపోతున్నాడు. అందుచేత వారిని పోషించినవాడగుట లేదు అని అన్నదేవుని వచనము.

అర్యమా దేవత అనగా ఎవరు? ఈ విషయమై తైత్తిరీయ సంహితలో ఈ విధంగా చెప్పబడింది.

అర్యమ్ణే చరుం నిర్వపేద్యః కామయేత దాన కామామే ప్రజాస్స్యురిత్యసౌవా ఆదిత్యోర్యమా యః ఖలు వై దదాతి సోర్యమా, అర్యమణమేవ స్వేన భాగధేయేనోపధావతి స ఏవాస్మై దానకామాః ప్రజాః కరోతి దానకామా అస్మై ప్రజాభవన్తి ॥ – తై.సం.. 2-2-4.

ప్రజలు తనకు దానము చేయువారు కావలయునని కోరుచున్న యజమానుడు అర్యమ అను దేవతకు అన్న హోమము చేయాలి. ఇదొక యాగము, ఈ యాగానుష్ఠాన ప్రభావము చేత ప్రజలు తనపట్ల ధన దానము అన్నదానము చేసే దాతలగుదురు. అర్యమ అనగా సూర్యుడు. ఈ యాగమందు ఆరాధింపబడిన సూర్యుని ప్రేరణ చేతనే ప్రజలు దాతలగుటచేత దాత కూడ అర్యమా-సూర్యుడే అని ఈ శ్రుతి వర్ణిస్తోంది. ఎవరి అనుగ్రహము ఎవరిలో ప్రవేశించునో వారు వారే అనుట సహజము గదా? అందుచేత దాత కూడ సూర్యుని వలే ప్రకాశింస్తున్నాడని భావించాలి. అట్టి అర్యమాది దేవతలనూ మిత్రులనూ అదాత అన్నదానముతో ఆరాధించక పోవుట చేత అదాత ఇహలోక, పరలోక భ్రష్టుడు. అదాతను కేవలాఘుడని శ్రుతి నిందించినది. ఎవరికీ పెట్టక తను మాత్రమే తిను వానిని కేవలాఘుడు అంటారు. అనగా అదాత భుజించునది అన్నము కాదు పాపమే, పాపాన్నే తింటున్నాడు. పాప రూపముతో ఉన్న అన్నాన్ని తింటున్నాడు అని భావము. కొంచెంగానైనా ఇతను పుణ్యమును సంపాదించటం లేదు. అధాత అన్నమును భుజించుట అన్నవధ అని అందురు. ఇది నరక ప్రాప్తికి కారణము.

8వ మంత్రము –

అహం మేఘస్తనయన్ వర్షన్నస్మి । మామదన్తి అహమద్మి అన్యాన్ ॥
అహగ్ం సదమృతో భవామి । మదాదిత్యా అధి సర్వే తపన్తి ॥

మరల అన్నదేవుని మహిమ ఈ మంత్రమందిట్లు వర్ణింపబడుచున్నది. నేను మేఘ స్వరూపడనై యుండి ఉరుముచూ వర్షిస్తున్నాను. యజ్ఞములలో అగ్నియందు హోమము చేయబడిన అన్నము సూక్ష్మరూపంలో సూర్యుని చేరుతోంది. సూర్యుడు తన యందు సంక్రమించిన సూక్ష్మ స్వరూపముతో మేఘమును సృష్టించగా, ఆ మేఘము వర్షిస్తోంది. ఈ రహస్యాన్ని

అగ్నౌ ప్రాప్తాహుతిస్సమ్యగాదిత్య ముపతిష్ఠతే । ఆదిత్యాజ్జాయతే వృష్టిః । అను

